# కళావతి

కళావతి అరణ్యంలో సంచరిస్తోంది. భయంకరమైన క్షయ వ్యాధి శరీరాన్నంతా అలముకుంటోంది. అంతలోనే తన రూపం ఎంత వికృతంగా మారిపోతుందో చూసుకుంటుంటేనే నిలువెల్ల వణుకు పుట్టింది కళావతికి.

ఈ ఘోరారణ్యంలో తన కెవరు దిక్కు స్నేహధర్మం ఇలా పరిణమిస్తుందని ఊహించని కళావతి కన్నీళ్ళు ఎడతెగకుండా ప్రవహిస్తున్నాయి.

అనుకోని పశ్చాత్తాపం కళావతి మనసుని కదిలించి వేసింది. తను పారుడనే మహర్షి కూతురు - తనకెందుకీ విద్యాధర, గంధర్వ స్నేహాలు. పోనీ స్నేహం అంతతో ఆగక, స్నేహితురాలిని రక్షించటంకోసం తను ముని నుండి ఈ ఘోరశాపాన్ని పొందటమేమిటి - ఏ ఒక్కదానికి సమాధానం దొరకటం లేదు కళావతికి.

ధ్యాననిష్ఠలో వున్న మునిని అవమానపరిస్తే అతడు శపించడా - ఇంతకీ విధిని ఎదిరిచటం ఎవరికి సాధ్యం - కళావతికి అడుగుముందుకు పడటం లేదు. శరీరంలో విపరీతమైన అలసట - చెట్టు నీడన నిల్చింది శూన్యంలోకి చూస్తూ.

ఆమెకు తన జన్మ వృత్తాంతమంతా కళ్ళ ముందు నిల్చింది. ఆశ్రమవాటికలోని స్త్రీలు ఒకనాడు తనతో ముచ్చటలాడుతూ తన విశేషసౌందర్యానికి కారణం తన తల్లి అన్నారు. కళావతికి తల్లియైన పుంజిక స్థల గుర్తొచింది.

పారుడనే మహర్షి సమస్త విద్యలలో ఆరితేరాలన్నానుడు. దీనికి తపస్సే ధ్యేయంగా పెట్టుకున్నాడు. అతని తపోవనం మనోహరంగా ఉంది. అందమైన పూలతీగలతో అల్లుకున్న పొదరిండ్లు, చిలుకల, కోయిలల మధుర ధ్వనులు చెలరేగే ఉద్యావనం, ఎటుచూసినా పచ్చని చెట్లు - ఆ తపోవనంలో ధ్యానంతో ఉండ గలగటమే విశేషం. పారుడు తపోదీక్ష వదలకుండా పాదాంగుష్ఠము భూమిపై నిలిపి మండుటెండలో ఘోర తపం చేస్తున్నాడు.

ఈ తపస్సు విషయం విన్న దేవేంద్రుడు భయపడిపోయాడు...స్వర్గాన్ని జయించడానికా ఈ తపస్సు అనే భావం అతన్ని కంపింప చేసింది.

వెంటనే సభాస్థలకి పుంజిక స్థలను పిలిపించాడు. ఆ అప్సరస ఇంద్రుని వాక్యం శిరసావహించింది...మన్మథ బాణంలా వచ్చి పారుని తపోవనంలో ప్రవేశించింది.

పూలు కోసే వంకతో పుంజికస్థల తన వయ్యారం వలుకబోస్తూ ఋషి ముందు నిల్చింది.

ఇంద్రుని భయం తీరింది. అప్సరస కౌగిలిలో బంధింపబడ్డాడు మహర్షి - ఆ మహర్షి, పుంజిక స్థలల కూతురైన తను ఈనాడు ఈ అడవిలో ఈ క్షయరోగంతో ఇలా ఆర్తురాలై సంచరించటం ఎంత చిత్రమైనదో అనుకుంటూ గతాన్ని నెమరువేసుకుంటూ అడుగులో అడుగు వేస్తూంది కళావతి.

కళావతికి అంతలోనే చిరునవ్వు వచ్చింది. తన జీవితం ఎన్నెన్ని మలుపులు తిరిగిందో తల్చుకుని ఆశ్చర్యపోయింది.

యౌవనవంతురాలైన తనను దేవాపి అనే గంధర్వుడు ప్రేమించాడు. తన తండ్రి మహర్షి అని తెలిసి, ఒంటరిగా రావటానికి భయపడి తనవారిని వెంటపెట్టుకొని పర్ణశాలలోకి ప్రవేశించాడు.

కానీ దేవాపి వెంటవచ్చిన వారి వేషము, వారి ఎర్రని కళ్ళు, తాంబూలపు నోళ్ళు, సుగంధ ద్రవ్యాలు పూసుకున్న శరీరాలు చూస్తుంటే అసహ్యం కలిగింది పారునికి. వీరితోనా నేను వియ్యమొందేదనే భావం అతనికి అవమానంగా తోచింది. వారిని దూషించగా, దేవాపి మనుష్యులు అవమానపడి వెళ్ళిపోయారు.

కానీ తనను ప్రేమించిన దేవాపి ఈ అవమానం భరించలేక అర్థరాత్రి రహస్యంగా వచ్చి తన తండ్రిని చంపేశాడు.

కన్న తల్లి తనను పారేస్తే, తనే తల్లితండ్రి అయి పెంచాడు తండ్రి. ఈ రోజు దిక్కులేని దానినయి ఎలా బతకాలని, ప్రాణత్యాగం చేసుకొంటున్న తనను ఆనాడు పార్వతీదేవి రక్షించింది. తనకు స్వరోచి మహారాజుతో వివాహమవుతుందని ఆశీర్వదించింది. సమస్త సౌఖ్యాలు ప్రసాదించే పద్మినీ విద్యను కూడా అమ్మవారు దయ చేసింది. - అలాంటి తను ఈనాడు మునిచే శాపగ్రస్తురాలై అడవిలో తిరుగాడటం చూస్తుంటే విధి బలీయమైందని మరోసారి అనిపించి ముందుకు అడుగు పడక అక్కడే కూలబడిపోయింది కళావతి నిస్పృహతో.

స్నేహధర్మం గొప్పదికదా! స్వరోచిని వివాహమాడిని మనోరమ మనస్సు పూర్తిగా శాంతి పొందటలేదు. తనను రక్షించటానికై మునివర్యులతో పోట్లాడి క్షయరోగగ్రస్తులైన తన స్నేహితురాళ్ళేమయ్యారో అనే చింత మనోరమను బాధిస్తోంది. ఉద్యానవనమంతా వెన్నెల ఆరబోసినట్లే వుంది. స్వరోచి మనోరమ కళ్ళలోని నీలికాంతులు చూస్తూ, 'నీ మనసులో ఏ చింత వుందో చెప్పు...నీవు ఆనందంగా లేకపోతే ఈ వెన్నెల, ఈ చల్లగాలి, ఈ పూలసౌరభం నాకేమీ ఆనందాన్ని కలిగించవు'-

మనోరమను కౌగిలిలోకి తీసుకున్నాడు స్వరోచి. మనోరమ కళ్ళలోని నీటిపోర మహారాజుకి బాధ కల్గించింది. గద్గద స్వరంతో జరిగిందంతా చెప్పి, "నా స్నేహితురాళ్ళ క్షయరోగం పోగొట్టాలి. వారిని నాతో తీసుకురావాలి" అంది మనోరమ నెమ్మదిగా. స్వరోచి చిరునవ్వుతో "దేవిగారి కోరిక ఏది కాదనగలను" అన్నాడు. స్వరోచి మనోరమలు బయలుదేరారు అరణ్యమంతా సంచరించారు. దూరంగా చెట్టు క్రింద కృశించిన శరీరంతో వున్న స్త్రీ మూర్తిని కళావతిగా గుర్తించి, పరుగు పరుగున సమీపించింది మనోరమ.

ఇందీవరాక్షుడిచ్చిన ఆయుర్వే విద్యతో కళావతి క్షయరోగాన్ని తగ్గించాడు స్వరోచి.

కళావతి ఆనందానికి హద్దుల్లేవు. ఏనాడూ ఊహించని భాగ్యం ఇది - తిరిగి తను తన సౌందర్యాన్ని పొందింది. తన ఆరోగ్యాన్ని పొందింది - తనకి ఇంత ఉపకారం చేసిన మహారాజుకు తను ఏ ప్రత్యుపకృతి చేయగలదో అనుకుంటున్న కళావతి మనసులో పార్వతిదేవి రూపం భాసించింది.

వెంటనే "మహారజా - మీ ఋణం ఎలా తీర్చుకోగలను నేను - దీనికి ఒక్కటే మార్గం - ఒకనాడు నన్ను రక్షించి, నాకు పద్మినీవిద్యను ప్రసాదించింది పార్వతీదేవి. ఆవిద్య సమస్త సౌఖ్యాలను కల్గిస్తుంది. అది మీకు నేను యిస్తున్నాను. నాపై దయదలచి ఆవిద్యను గ్రహించండి" చేతులు, జోడించి నమస్కరించింది కళావతి. మనోరమ అంగీకారంతో పద్మినీ విద్యతో సహా కళావతిని వివాహమాడాడు స్వరోచి.

అప్సరసకు, మహర్షికి జన్మించి,<br>
ఒక మహర్షిచే శాపాన్ని పొంది,<br>
చివరకు మహారాజును చేపట్టిన కళావతి తన జన్మ ధన్యమయినదని మురిసిపోయింది, స్వరోచి మహారాజు సాంగత్యంలో.

- కావ్యతారలు - వనిత ఆగష్టు 1989